

కథాకళి

మల్లాది వెంకటకృష్ణమూర్తి

# ఓ కార్టూనిస్ట్ కథ

పన్నెండు పోర్షన్స్‌గల పెద్ద ఇల్లు అది.

పన్నెండూ నిండుగావున్నాయి. తెలుగువాళ్ళలో వుండే ఓ గుణం ఆ పన్నెండు పోర్షన్స్‌లోని అందరికీ లోపించింది దాంతో ఒకరిపేర మరొకరు చాడీలు చెప్పుకోకుండా ఎలాంటి పొరపచ్చాలు లేకుండా ఒకే కుటుంబంలోని సభ్యులలాగా కలిసిపోయారు

ఆ వాటాల్లోని అందరూ సాహితీ ప్రియులే తెలుగులో వచ్చే అన్ని వార మాస పత్రికలు ఆ కాంపౌండ్‌లోని అందరూ కలిసి వుమ్మడిగా కొంటూంటారు ఆడవాళ్ళలా సీరియల్స్ చదవరు ఆ కాంపౌండ్‌లోని మొగవాళ్లు కేవలం జోక్స్, కార్టూన్స్ సినిమా విశేషాలు మాత్రం చదువుతుంటారు ఆడవాళ్ళు సీరియల్స్ గురించి చర్చించుకుంటూంటే మగవాళ్లు కార్టూన్స్ తమలో తామే చెప్పుకుని నవ్వుకుంటూంటారు పేకాటమీద కార్టూను వస్తే పేకా...

...వ్యసనంగల నంబరు తొమ్మిదవాటా యజమానికి అంటపెట్టిస్తారు మందు మీద కార్టూను వస్తే నంబర్ నాలుగో వాటా యజమాని భార్యకి చూపిస్తారు ఆవిడ భర్త మందు మాస్టరు గయ్యాళి భార్యమీద కార్టూన్ని నంబర్ ఒకటోవాటా పెద్దమనిషికి ఆయన భార్య చూడకుండా చూపిస్తారు చీరల పిచ్చిమీద కార్టూను నెంబర్ ఆరోవాటాలోని ఆవిడకి చూపిస్తారు. ఇలా దాదాపు చాలా కార్టూన్లు ఆ కాంపౌండ్‌లో నివారో ఒకరికి సంబంధించినవే

ఓ రోజు వాటానంబర్ అయిదులోని దేవసేనరావు సాయంత్రం ఆఫీసునుండి సరాసరి యింటికివచ్చి అందరిని పిలిచి ఓ వార్త చెవిన వేసాడు

కార్టూనిస్ట్ జీవనరావు తమ ఆఫీసుని ఇన్స్పెక్టు చేయడానికి హెడ్ ఆఫీస్‌నుంచి వచ్చాడు జీవనరావు దేవసేనరావు పనిచేసే కంపెనీలో ఇంటర్నల్ ఆడిటర్గా పనిచేస్తు



న్నాడు. ఈ మధ్యే చేరాడు.

అందరూ అరగంటసేపు అతని కార్టూన్స్‌గురించిచర్చించుకున్నారు అతన్ని తమ కాంపౌండ్‌కి ఆహ్వానించడానికి నిర్ణయించుకున్నారు.

మర్నాడు సాయంత్రం జీవనరావుని దేవసేనరావు వెంటబెట్టుకుని వచ్చాడు. గతరాత్రి అతను వేసిన కార్టూన్స్‌ని పట్టుకువచ్చాడు జీవనరావు వాటిని అందరికీ చూపించాడు

"నిన్న రాత్రే వేసాను వీటిని" చెప్పాడు

"మీరు కార్టూన్స్ ఎప్పుడు వేస్తుంటారు?" అడిగింది ఓ పత్రికాభిమాని

"ఏడు నించి తొమ్మిదిదాకా. అప్పుడే మూడ్ వస్తుంది మిగతా సమయాల్లో వేయను."

కార్టూన్స్‌కి ఇన్స్పిరేషన్ గురించి గీసే విధానం గురించి. వాడే కుంచె గురించి ఇలా అనేకవిషయాలమీద ప్రశ్నలడిగారువాళ్లంతా. ఆరాత్రి కాంపౌండ్‌లోని ఒకళ్ళింట్లో భోజనం చేసి తొమ్మిదిన్నరకి వెళ్ళాడు జీవనరావు. మర్నాడు తమ యింటికి భోజనానికి రావలసిందిగా వాటా నంబర్ టూ ఇంటి యిల్లాలు ఆహ్వానిస్తే దాన్ని అంగీకరించి మరీ వెళ్ళారు

జీవనరావు మర్నాడు రాత్రి కూడా గీసి కొట్టాడు జీవనరావు ఎంతో సరదాగా మాట్లాడుతుంటాడు జోక్స్ యాంత్రికంగా దొర్లుతుంటాయి అతని మాటల్లో.

వాటానంబర్ సిక్స్ ఆయన తమ ఇంటికి భోజనానికి రమ్మనమని ఆహ్వానించడంతో ఆ మర్నాడు కూడా జీవనరావు ఆ కాంపౌండ్‌లోని వాటాదార్ల సభ్యులతో హుషారుగా గడిపాడు.

జీవనరావు బందరులో వున్న తొమ్మిది రోజులూ సాయంత్రాలు ఆ కాంపౌండ్‌లోనే గడిపి గెస్ట్ హౌస్‌కి రాత్రి పదిన్నరకి భోజనం అయ్యాక బయలుదేరేవాడు.

ఇన్స్పెక్షన్ పూర్తి చేసుకుని అతను పదోరోజు మధ్యాహ్నం హైదరాబాద్ వెళ్ళిపోయాడు ఆ రోజు సాయంత్రం దేవసేనరావు ఆఫీస్‌నించి ఇంటికి వచ్చాక అడిగారు అంతా

"మీ కార్టూనిస్ట్ వెళ్ళిపోయాడా?"

తలవూపాడు దేవసేనరావు

"రోజుకి పదిదాకా కార్టూన్స్ గీస్తాడట తొమ్మిది రోజులు అతని కార్టూన్స్ గీసే సమయంలో, భోజనం మిషతో అతన్ని కార్టూన్స్ గీయకుండా ఆపగలిగాం అంటే దాదాపు తొంభై కార్టూన్స్ నించి ఆంధ్ర పాఠకులని కాపాడగలిగాం" చెప్పాడు వాటానంబర్ మూడు.

"అతని మాటల్లోని హాస్యం కార్టూన్స్‌లో చస్తే కనపడదెందుకో హైదరాబాద్‌లో కొన్ని లక్షల మంది వున్నారు వాళ్ళల్లో అతని అభిమానులు కానివారు వేలల్లో వుంటారు 'చిరునామ కనుక్కొని రోజుకొకరు భోజనానికో సినిమాకో పిలిచి అసలు కార్టూన్స్ గీసే టైం లేకుండా చేస్తే' అనే ఆలోచన మనలా వాళ్ళలో ఏ ఒక్కరికి వచ్చినా ఎంత బావుంటుంది" చెప్పాడు వాటానంబర్ పన్నెండు యజమాని.